బతుకమ్మకు దూరం.. తెలంగాణ తల్లి

''ఇదేం సంస్కృతి.. ఎంతో మంది అనుభవజ్ఞుల ఊహగానాలను క్రోఢీకరించి ఒక రూపాన్ని ఇచ్చి తెలంగాణ తల్లిగా ఏర్పాటు చేసుకున్నం. గత ప్రభుత్వాల తీరు తెన్నులను కాదనే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడిది? బీఆర్ఎస్ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మేధావులు, కవులు, రచయితలు, ఉన్నతాధికారులు, ఎంతో మంది అనుభవజ్ఞులను ఏకతాటిపైకి తీసుకొచ్చి తెలంగాణ తల్లి రూపం పోశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ ఒక చేతిలో, వరి పన్నలు, మొక్కజొన్న కంకులు మరో చేతిలో ఉండేలా జాగ్రత్త పడి చిత్రించిన విధానాన్ని తప్పు పట్టడం తెలంగాణ వాదులను, పెద్దలను అవమాన పర్చడమే. అంతే కాకుండా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మను తల్లి నుంచి వేరు చేయడం తెలంగాణ మహిళలు, ఆడపడచులు, బాలికలకు ఘోర అవమానమని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు మంగళవారం గొంతెత్తి నినదించి, అసలైన తెలంగాణ తల్లికి నగరమంతటా క్షీరాభిషేకం చేశారు. ఈ నేపథ్యంలో గత పదేండ్లుగా తెలంగాణ తల్లిగా కొనసాగిన అమ్మ ఇప్పుడెందుకు మనలేకపోతున్నది? ప్రభుత్వానికి ఇదే ప్రధాన సమస్యా? నేడు తెలంగాణలో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయి. విద్యా, వైద్య, నిరుద్యోగ సమస్యలతో జనం కొట్టుమిట్టాడుతున్న విషయం పట్టని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు మార్చాల్సి వచ్చింది? చేత గాని దద్దమ్మలు.. కాంగ్రెస్ ప్రభుత్వాధినేతలు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను రూపు మాపేందుకు, తమ ఉనికిని చాటుకునే కుతిల ప్రయత్నంలో భాగమే.. ఈ తెలంగాణ తల్లి విగ్రహపు మార్పు అని పలువురు నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తెలంగాణలో ఎక్కడ చూసినా కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఆనవాళ్లే కనిపించడంతో భయభ్రాంతులకు లోనై, చేసేదేమీ లేకే కనీసం ఈ విగ్రహాన్నైనా మార్చి ఉనికిని చాటుకొని సంతోషపడే ఘట్టాన్ని తలకెత్తుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల చిహ్నమైన చేతి గుర్తును ప్రధానంగా చూపేలా.. సీఎం రేవంత్ కుసంస్కారానికి తెర తీశారని తెలుస్తుంది. అభివృద్ధికి బాటలు వేయలేని ప్రభుత్వానికి.. ఈ మార్పు ఎంత వరకు శ్రేయస్కరమో.. ఏ మేరకు ఫలవంతమో.. కాంగ్రెస్ పార్టీ నేతలకే తెలియాలి''

కృష్ణకాంత్ పార్క్ వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



జిల్లెలగూడ చందన చెరువు కట్టపై తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తదితరులు

మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

చైతన్యపురి ప్రభాత్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాంనగర్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి చిత్ర పటానికి మంగళవారం క్షీరాభిషేకం చేస్తున్న ముషీరాబా ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

తెలంగాణ తల్లి విగ్రహం కాదది.. కాంగ్రెస్ తల్లిది

కేసీఆర్ తెలంగాణ దార్శనికుడు.. అది చెరిపితే చెరిగే చరిత్ర కాదు - మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 10: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరించినది తెలంగాణ విగ్రహం కాదని, అది కేవలం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తును చూపే కాంగ్రెస్ తల్లిదని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఆమె మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మ తొలగించి, ఆడ బిడ్డలను అవమానించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ చేశారని అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని ఎందుకు మార్చారో? ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేధావులు, ఉద్యమకారులతో చర్చించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ నమూనాలను చెరిపివేయడానికి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని ఆమె ఆరోపించారు. తెలంగాణ ఆడపడుచులకు ఇష్టమైన బతుకమ్మను తొలగించడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించుకున్న రోజు ఆడ పడుచులైన ఆశా వర్కర్ల పై దాడి చేశారన్నారు. తెలంగాణ చరిత్రను తుడిచి పెట్టాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అన్న నినాదంతో ముందుకు సాగిందన్నారు. కేసీఆర్ నినాదం ఫలప్రదం అయ్యిందన్నారు. కేసీఆర్ అనవాళ్లు లేకుండా ఎవరు చేయలేరన్నారు. తెలంగాణకు కేసీఆర్ దార్శనికుడు అని అన్నారు. ఆయన చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయే చరిత్ర కాదు అది.. అని అన్నారు.

రియల్ ఎస్టేట్ పోతే.. పోయిందేం లేదు

ఆ ఐదు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తేవాలి

హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాటిపల్లి

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోతే పోయిందేం లేదని, తెలంగాణ ప్రభుత్వం ముందుగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకురావాలని, ఇందుకు అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. వెంకటరమణా రెడ్డి హైడ్రా కార్యాలయంలో ఐదు రియల్ స్టేట్ కంపెనీలపై కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు కంపెనీలు చెరువులను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టాయన్నారు. దీనిపై రెండు నెలల క్రితమే తాను ప్రెస్‌మీట్ పెట్టానని, తాను మాట్లాడిన పదిరోజుల తర్వాత పర్మిషన్ ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం, డిప్యూటీ సీఎం ప్రకటించారన్నారు. ఈ కంపెనీలకు అసలు పర్మిషన్ ఇచ్చిన వారెవరు? వారిపై చర్యలెందుకు లేవు? అనే అంశాలపై తాను అడిగానని వెంకటరమణా రెడ్డి చెప్పారు. దీనిపై అసెంబ్లీలో మాట్లాడతానని, తప్పు చేసిన వారు మంత్రులైనా, అధికారులైనా శిక్షార్హులేనని ఆయన పేర్కొన్నారు. అనుమతులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే తాను కోర్టుకు వెళ్తానని కాటిపల్లి చెప్పారు. ల్యాండ్ గ్రాబింగ్‌ను నిరోధించడానికి యాక్ట్ తేవాలని, దీనిపై అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామన్నారు. ల్యాండ్ గాబింగ్‌కు సంబంధించి రిఫార్మ్స్ తీసుకురాకపోతే ప్రజలు తిరగబడి నాయకులను తరిమికొడతారని అన్నారు. వెంకట రమణారెడ్డి తన ఫిర్యాదులో ఐదు కంపెనీల పేర్లను ప్రస్తావించారు. హైడ్రాతో పాటు హెచ్ఎండీఏ, రెరా, టీజీఐఐసీ, జీహెచ్ఎంసీలలో ఫిర్యాదు చేశామని వెంకటరమణారెడ్డి తెలిపారు.

మా వృత్తి మాకే కావాలి.. ప్రత్యేక జీవో కావాలి

నాయీ బ్రహ్మణులు పి.నర్సింహా నాయీ

కేపీహెచ్‌బీ కాలనీలో 'మా వృత్తి మాకే కావాలి...మాకు జీవో కావాలి' అని ఆందోళన చేస్తున్న కేపీహెచ్‌బీ కాలనీ నాయీ బ్రహ్మణులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 10: నాయీ బ్రహ్మణ కులవృత్తిని కాపాడాలని, నాయీ బ్రహ్మణ వృత్తిలోకి కార్పొరేట్ శక్తులు చొరబడకుండా ప్రత్యేక జీవో తీసుకురావాలని తెలంగాణ నాయీ బ్రహ్మణ సంఘం జీవో పోరాట సమితి రాష్ట్ర నాయకులు పి.నర్సింహా నాయీ ప్రభుత్వాన్ని కోరారు. 'మా వృత్తి మాకే కావాలి.. మాకు ప్రత్యేక జీవో కావాలి' అని డిమాండ్ చేస్తూ తెలంగాణ నాయీ బ్రహ్మణ సంఘం జీవో పోరాట సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నాయీ బ్రహ్మణులు ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరతరాలుగా నాయీ బ్రహ్మణులు కుల వృత్తినే నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్నారని, ఇటీవల కాలంలో కార్పొరేట్ శక్తులు నాయీ బ్రహ్మణ వృత్తిలోకి వచ్చి, పేద నాయీ బ్రహ్మణుల కడుపుకొడుతున్నారని పేర్కొన్నారు. పొట్ట కూటి కోసం వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నాయీ బ్రహ్మణులు రోడ్డున పడుతున్నారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను కాపాడాలని, నాయీ బ్రహ్మణులకు అండగా నిలువాలని కోరారు. నాయీ బ్రహ్మణుల వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం జీవోను తీసుకురావాలని, కార్పొరేట్ శక్తులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ నాయీ బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు పి.రమేష్, కార్యదర్శి వెంకటేశ్, ఆర్.భాస్కర్, యాదగిరి, శ్రీనివాస్, రాజు, అశోక్, కృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమం గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు

సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చిక్కడపల్లి, డిసెంబర్ 10: గతంలో ఉన్న చేనేత సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి, చేనేత కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు మండిపడ్డారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత కార్మికులు ఉపాధి లేక చేసిన కష్టానికి తగిన ఆదాయం లేక అనేక ఆర్థిక ఇబ్బందులు గురవుతూ కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవ సభలంటూ ఆర్భాటం చేస్తుందన్నారు. చేనేత పరిశ్రమలకు, కార్మికుల బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేస్తానని మాఫీ చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహహరిస్తుందని మండిపడ్డారు. వనం శాంతి కుమార్ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూరపాటి రమేశ్ గంజి, మురళీధర్, కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, పాసికంటి లక్ష్మీ, నర్సయ్య, నరసింహారెడ్డి, రాజేశ్, చిక్క దేవాదాస్, వీరన్న, శంకరయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేడియోలో రాణించడానికి గొంతు ఒక వరమైంది

ఆకాశవాణి కళాకారిణి శారదా శ్రీనివాసన్

పరిణతవాణి ప్రసంగం చేసిన శారదా శ్రీనివాసన్‌ను సత్కరిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 10: గొంతు వరంగా లభించడంతో రేడియో నాటకాలలో నిరంతర సాధనతో సహచరుల ప్రోత్సాహంతో రాణించానని అలనాటి ఆకాశవాణి కళాకారిణి శారదా శ్రీనివాసన్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పరిణతవాణి ప్రసంగాల పరంపరలో భాగంగా శ్రీనివాసన్ ప్రసంగిస్తూ, నాటకాలు, సంగీత రూపకాలు, కార్మికుల ముచ్చట్లు, సంస్కృత పాఠం, నవలా పఠనం తదితర కార్యక్రమాలు రేడియోలో పేరు తెచ్చాయని పేర్కొన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ, ఆకాశవాణి శ్రోతల్లో తన వాణితో శారదా శ్రీనివాసన్ అపారమైన ప్రాచుర్యం పొందారన్నారు. గొంతుతో నవ రసాలు పలికించిన శారదా కథ, నవల ప్రక్రియలలో కూడా రచనలు సాగించారని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ, మహనీయ కళాకారిణిగా రేడియో శ్రోతలు ఆమెను అభిమానించేవారని అన్నారు. పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డాక్టర్ సిల్మానాయక్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను గౌరవించడం శుభ పరిణామం

టీజీవో నేతలు

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): ప్రతి తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ అధికారులను, కళాకారులను, కవులను గౌరవించడం శుభ పరిణామమని హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులు ఎంబీ కృష్ణ యాదవ్, ఎంఏ ఖాదర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చొరవను టీజీవో నేతలు కొనియాడారు.

12, 13 తేదీల్లో కళాకారుల డప్పుల మోత

కళాకారుల డప్పుల మోత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: ఈ నెల 12, 13 తేదీల్లో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో '32 గంటల కళాకారుల డప్పుల మోత' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివిధ సంఘాల నాయకులు తెలిపారు. ప్రముఖ కవి, గాయకుడు నేర్నాల కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కళాకారుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకట్, వలిగొండ నరసింహ, జంగిలి దర్శన్, బోరెల్లి సురేశ్, గణేశ్, సురేశ్ యాదవ్, శంకర్ యాదవ్, ప్రవీణ్ నాయక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శతక షట్కము పుస్తకావిష్కరణ

శతక షట్కము పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

రవీంద్రభారతి, డిసెంబర్ 10: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఎమ్వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యంలో కడియాల ప్రభాకరరావు రచించిన 'శతక షట్కము' పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ పుస్తకావిష్కరణ సభకు వక్తలుగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, సుద్దాల అశోక్ తేజ, సభాధ్యక్షులుగా శ్రీభాష్యం శ్రవణ్ కుమార్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి శతక షట్కము పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ, రచయిత కడియాల ప్రభాకరరావు చాలా అద్భుతమైన శతకాలను రచించారని ఆమె కొనియాడారు. మనం చిన్న నాటి నుంచే శతకాలను నేర్చుకున్నామని, వ్యక్తి వికాసానికి శతకాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

దేశ చరిత్రపై లోతైన అధ్యయనాలు జరగాలి

సాక్షి దిన పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ వర్దెల్లి మురళి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాక్షి దిన పత్రిక ఈడీ వర్దెల్లి మురళి, మురళీ, ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, సత్యనారాయణ

ఖైరతాబాద్, డిసెంబర్ 10: భారతదేశ చరిత్రపై లోతైన అధ్యయనాలు, పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని సీనియర్ సంపాదకులు, సాక్షి దిన పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ వర్దెల్లి మురళి అన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్ దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి రచించిన 'లాస్ అండ్ గెయిన్ ఇన్ బ్రిటీష్ ఇండియా' పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగం ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ 'లాస్ అండ్ గెయిన్ ఇన్ బ్రిటీష్ ఇండియా' పుస్తకం బ్రిటీష్ కాలంలో భారతదేశానికి జరిగిన ఆర్థిక దోపిడీని గురించి ప్రొ. సుబ్రహ్మణ్యం చక్కగా వివరించారన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం రాక ముందు భారత్ సుసంపన్నమైన, నాగరికత అయిన దేశంగా ఉందని, 200 ఏండ్ల పాటు దేశాన్ని పీల్చి పిప్పి చేసినట్లు దుర్మార్గమైన చరిత్ర ఉందన్నారు. లక్షలాది మంది అమానవీయంగా దోపిడీ, దౌర్జన్యాలకు గురయ్యారన్నారు. ఈ చరిత్ర మీద జరుగాల్సిన పరిశోధనలు పెద్దగా జరుగలేదన్నారు. 200 సంవత్సరాల్లో సుమారు 45 ట్రిలియన్ డాలర్స్ భారత దేశ సంపదను బ్రిటీష్ వారు తరలించుకపోయారన్నారు. ఇలా చర్చించుకుంటే ప్రపంచంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని, ఖగోళ, గణిత శాస్త్రం, మెడిసిన్‌లో ఐదో శతాబ్దం నుంచి గొప్ప గొప్ప ఆవిష్కరణలు జరిగాయన్నారు. కార్యక్రమంలో మురళి, ప్రొ. సుబ్రహ్మణ్యం రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారానికి గొంతుకనవుతా

మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 10: ఆశా వర్కర్లకు సమస్యలను పరిష్కరించేంత వరకు శాసన మండలిలో వారి తరుపున తాను గొంతుకను అవుతానని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి ఆశా వర్కర్లకు ధైర్యాన్నిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా దవాఖానాలో పోలీసుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఆశా వర్కర్ ఎస్కే రహీమాబీని ఆయన పరామర్శించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించే ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు శాసన మండలిలో పోరాడుతానని ఆశాలకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు ఆర్ ఎంవో డాక్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అభివాదం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

హామీని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

కాంట్రాక్ట్ అధ్యాపకులకు దిక్కెవరు?

సంఘం అధ్యక్షులు ఉపేందర్

ఖైరతాబాద్, డిసెంబర్ 10: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడుస్తున్నా పట్టింపు లేని ధోరణి అవలంబిస్తుందని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు ఈ.ఉపేందర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోనే కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్ ద్వారా వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని అమలు చేయకపోగా, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసే ప్రయత్నంలో ఉన్నారన్నారు. ఫలితంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే అనేక మంది అధ్యాపకులు చాలీ చాలనీ వేతనాలతో పనిచేస్తున్నారని, అందులో కొందరు అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. మరికొందరు ఎలాంటి బెనిఫిట్స్ లేకుండానే పదవీ విరమణ పొందారన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను విస్మరించి విజయోత్సవాలు జరుపుకుంటున్నారని, తమ సమస్యను పరిష్కరించకుండా నోటిఫికేషన్లు జారీ చేస్తే అడ్డుకొని తీరుతామని, రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి తరగతులను సైతం స్తంభింపజేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

క్లాట్ 2025 ర్యాంకుల్లో అభ్యాస్ విద్యార్థుల ప్రతిభ

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): క్లాట్ 2025 ర్యాంకుల్లో అభ్యాస్ లా ప్రెప్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో సాధన లింగ అద్భుతంగా ఏఐఆర్ 41 (కూకట్‌పల్లి) సాధించగా, అక్షిత్ (ఏఐఆర్ 102/ సికింద్రాబాద్) ర్యాంకుతో జాతీయ స్థాయిలో టాప్ కేటగిరీలో నిలిచారు. అదనంగా 9 మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించినట్లు అభ్యాస్ లా ప్రెప్ సీఈఓ నరేష్ దుబ్బుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, అంకిత భావం మన గర్వకారణమన్నారు.